

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

2024-జనవరి

క్రిస్మస్ సెలవులు ముగించుకొని స్టడీ టర్మ్ మొదలై వారం రోజులైనా, ఇంకా కాంపస్ ఖాళీ ఖాళీగా, చలికాలానికి తగ్గ బద్ధకంగానే వుంది. ఆ రోజు క్లాసులు లేకపోయినా, వ్రాసుకోవాల్సిన పేపరు వుండడంతో పొద్దున్నే తన ఆఫీసుకొచ్చి కూర్చున్నాడు అశోక్. కొంచెం సేపు పని చూసుకోగానే వేడిగా టీ తాగితే బాగుండనిపించింది. లేచి ఫాకల్టీ రూంలో కెళ్ళి టీ పెట్టుకుందమనుకున్నాడు. కేంటీన్‌లో దొరికేంత మంచి టీ కాదు కానీ, ఇప్పుడు కేంటీన్ దాక నడిచి వెళ్ళే ఓపిక లేదు.

ప్రతీ డిపార్ట్‌మెంటుకీ ఒక సెపరేటు టీ రూమూ, అందులో ఒక కెటిలూ, మైక్రోవేవూ, పాలూ, లంచి బాక్సులు పెట్టుకోవడానికో రెఫ్రిజేరటరూ, టీ బేగులూ, కాఫీ పౌడరూ పేంట్రీలో పెడుతున్నారు. అయినా టీ బేగులతో టీ ఎవరికీ నచ్చదు. అవలా పడి వుంటాయి. ఇదిగో, ఇలా కేంటీన్ దాకా నడిచే ఓపిక లేనప్పుడు టీ రూంలో కెళ్ళి కాఫీయో టీయో పెట్టుకోవడానికి వీలుగా వుంది.

కెటిల్‌లో మరుగుతున్న నీళ్ళు చూస్తూ నిలుచున్నాడు అశోక్. అతను వ్రాయాల్సిన పేపరు గురించీ, ఇవ్వాల్సిన సెమినార్ గురించీ ఆలోచించాలని వుంది అతనికి. కానీ ఆలోచనలన్నీ ఎటూ సాగడం లేదు. ఏదో బర్న్ అవుట్ అయిపోయినట్టు, శక్తి అంతా ఉడిగిపోయి నీరసించినట్టు, నిరాసక్తంగా అనిపిస్తూ వుంది. తనకింకా యాభై మూడేళ్ళే, అయినా అప్పుడే ఏదో వయసు మీద పడ్డట్టు అనిపించడం ఏమిటి? మరీ అమ్మ పోయినప్పటినించీ తను చాలా డిప్రెస్ అవుతున్నట్టు తనకే తెలుస్తూ వుంది. భానుకి తన ప్రవర్తన చాలా చికాగ్గా వుందని అర్థమవుతూనే వుంది.

డిపార్ట్‌మెంటులో తన వృత్తిలో తను చాలా వెనకపడిపోయాడు. తనకన్నా పైవాళ్ళని వాక్చాతుర్యంతో మెప్పించి ప్రమోషన్ సంపాదించే సామర్థ్యం తనకు లేదు. అద్భుతమైన పేపర్లూ వ్రాయలేదు. అన్నిటికంటే శాస్త్రీయ నృత్యం పట్ల తనకున్న ఆసక్తి వల్ల తనంటే ఒక విచిత్రమైన అభిప్రాయం వుంది ఫాకల్టీలో. అది నిజమో, లేక తన భ్రమో మరి! ఇంతా చేస్తే తను పెద్దగా డాన్సు ప్రాక్టీసు చేసిందీ లేదు! ఆ సంతోషమూ, సంతృప్తీ కూడా తనేమీ పెద్దగా అనుభవించిందీ

లేదు. డిపార్ట్‌మెంటులో రాజకీయాలూ, ఎదుగుదల కనిపించని వృత్తీ, అమ్మ మరణమూ, ఏదో ఒత్తిడిగా అనిపిస్తూ వుంది అతనికి.

టీ కప్పు తీసుకొని అక్కడే వున్న టేబుల్ దగ్గర కూలబడి పక్కనే వున్న ఇండియా టుడే పత్రిక చేతిలోకి తీసుకున్నాడు.

"హలో అశోక్! గుడ్ మార్నింగ్! హేపీ న్యూ ఇయర్. క్రిస్మస్ బ్రేక్ ఎంజాయ్ చేసారా?" అసిస్టెంట్ ప్రొఫెసర్ మీనాక్షి లోపలికొచ్చింది.

"హలో మీనాక్షి గారూ! ఆల్ గుడ్. మీక్కూడా హేపీ న్యూ ఇయర్."

మీనాక్షి తన కాఫీ కప్పు తీసుకొని వచ్చి ఇంకో కుర్చీలో కూర్చుంది.

"డల్‌గా వున్నారు అశోక్. ఫేమిలీ అంతా ఓకేనా?" మీనాక్షి స్నేహంగా అడిగింది.

"డల్‌గా వున్నానా? ఎందుకలా అనుకుంటున్నారు?" అశోక్ ఆశ్చర్యంగా అడిగాడు.

"నేనొచ్చి అయిదు నిమిషాలయింది. నేనొచ్చినప్పటినించీ మీరు అదే పేరగ్రాపు వైపు చూస్తున్నారు."

అశోక్ నవ్వి చేతిలో పుస్తకం పక్కన పెట్టేసాడు.

"పాయింట్ లెస్ రీడింగ్! అదలా వొదిలేయండి. టెల్ మీ, వాట్ ఈజ్ ది మేటర్? ఇంట్లో అంతా బాగున్నారా?"

తననెవరూ అంత అక్కరగా,స్నేహంగా కుశలం అడగరు. అతనికి ఎవరికైనా మనసులో మాట చెప్పుకోని భారం దించుకోవాలనిపించింది. ఇంతలో అవిడే అడిగింది.

"పిల్లలెలా వున్నారు అశోక్? కిందటేడే కదూ మనందరం న్యూ ఇయర్ పార్టీలో కలుసుకున్నాం? ఈ యేడు ఎవరింట్లో జరిగింది పార్టీ? నేనిక్కడలేను, క్రిస్మస్, న్యూ ఇయర్‌కి మా ఇంటికి చెన్నై వెళ్ళాము. మీరెళ్ళారా పార్టీకి?"

"లేదండి, ఈ ఇయర్ మాకూ కుదరలేదు పార్టీకి వెళ్ళడానికి," అశోక్ బదులిచ్చాడు.

"అవునా? అది సరే, మీరు పిల్లల సంగతి చెప్పనే లేదు. మీ బాబు, వెరీ చార్మింగ్ యంగ్ చాప్, ఫిలిం మేకింగ్ అంటే ఆసక్తిగా వుండేవాడు. ఇంకా దాన్లోనే పని చేస్తున్నాడా?"

"అవును మీనాక్షీ. ఫిలిం మేకింగే కాదు, సొంతంగా విడియో ఎడిటింగ్ బిజినెస్ కూడా పెట్టుకున్నాడు. బానే నడుస్తూంది," ఎంత వొద్దనుకున్నా అతని గొంతులో చిన్న గర్వం తొంగి చూసింది.

"రియల్లీ? గ్రేట్! అమ్మాయి ఏం చేస్తూ వుంది? తన పేరు అమూల్య కదా?"

ఒక్క క్షణం చేతిలో వున్న పత్రిక వంక తదేకంగా చూసి నిట్టూర్చాడు అశోక్.

"బానే వుంది మీనాక్షి గారూ! అయినా తనతోనే చిన్న సమస్య!"

నవ్వింది మీనాక్షి.

"మా నాన్న అంటూ వుంటారు, చిన్న పిల్లలతో వచ్చేవి చిన్న సమస్యలు, పెద్ద పిల్లలతో వచ్చేవి పెద్ద సమస్యలు. ఇంతకీ మీ అమ్మాయితో వొచ్చిన సమస్యేమిటి? మీకు చెప్పాలనిపిస్తేనే చెప్పండి. నో ప్రెషర్."

ఆమె వంక సాలోచనగా చూసాడు అశోక్. తనకంటే పెద్దదైన ఒక అక్క తనకుంటే ఇలాగే వుండేదేమో. ఇలాగే అడిగేదేమో.

"అంత రహస్యమేమీ లేదు మీనాక్షి గారూ. మా అమ్మాయి, తనకి చాలా ఇష్టమని, ఒక అబ్బాయిని మాకు పరిచయం చేసింది. అతన్నే పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకుంటుంది."

"ఆ వయసులో సహజమే కదా? ఇంతకీ అమూల్య ఏం చదువుతోంది?"

"బియేస్సీ ఫైనల్ ఇయర్. పైన ఎమ్మెస్సీ కూడా చదువుకోవాలనే అనుకుంటుంది.కానీ, ఈ వయసులో ఇటువంటి డిస్ట్రాక్షన్ అవసరమా, అనిపిస్తూ వుంది నాకూ, భానుకీ."

" ఏ వయసుకి తగ్గ డిస్ట్రాక్షన్స్ ఆ వయసులో వుంటూనే వుంటాయి అశోక్. ఇంతకీ, అబ్బాయి ఎలా వున్నాడు? తనతో పాటే చదువుకుంటున్నాడా?"

నిట్టూర్చాడు అశోక్.

"అంతా బానే వున్నాడు మీనాక్షి గారూ. అయితే, హీ ఈజ్ ఎ ముస్లిం బోయ్." మీనాక్షి పెద్దగా నిట్టూర్చి కుర్చీలో వెనక్కి వాలింది.

"ఓకే, దిస్ కెన్ బీ ట్రిక్కీ! భాను చాలా అప్–సెట్ అయిందా?"

"అప్‌సెట్, అంటే బానే అప్‌సెట్ అయింది కానీ, షీ ఈజ్ రికవరింగ్. మీకు తెలుసో లేదో, మా ఇద్దరిదీ కులాంతర వివాహం, దాదాపు ముప్పై యేళ్ళ క్రితం. వీ ఆర్ క్వైట్ లిబరల్, యూ నో! కానీ ముస్లిం ప్రపంచంలో నా కూతురు భవిష్యత్తు ఎలా వుండబోతుంది? అస్తిత్వ వాదం బాగా బలంగా.."

"యేమిటి, అస్తిత్వ వాదం గురించి చర్చిస్తున్నారు? నాక్కూడా చెప్పండి," ప్రొఫెసర్ మెనన్ టేబిల్ దగ్గరకొచ్చి చేతిలో వున్న పత్రికలన్నీ అక్కడ పడేసాడు.

"అస్తిత్వ వాదం కాదు, ముస్లిం బాయ్ ఫ్రెండ్స్ గురించి మాట్లాడుతున్నాం."

"అవును, ఇప్పుడు ఎక్కడ చూసినా లవ్ జిహాద్ గురించే. మీకు తెలిసిన వాళ్ళెవరైనా లవ్ జిహాదీల పాల బడ్డారా?"

పక్కా కమ్యూనిస్టు ప్రాంతం కేరళలో పెరిగి లవ్ జీహాద్ గురించి మాట్లాడుతున్న మెనన్‌ని చూస్తే చిరాకేసింది. తను ఆపకపోతే ఈ చర్చ ఆయన ఎక్కడికైనా తీసికెళ్ళగలడు.

"ఇది లవ్ జిహాదీల గురించి కాదు ప్రొఫెసర్! అశోక్ వాళ్ళ అమ్మాయి ముస్లిం అబ్బాయిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటూందిట. ఆ విషయం గురించీ మాట్లాడుతూ వున్నాం." అతనికంటే ముందుగా మీనాక్షి అన్నది.

"ఓ, అవునా, మరి చెప్పరేం? కంగ్రాట్స్. సంబంధాలు వెతికే పనీ, కట్న కానుకలిచ్చే బరువునించీ తప్పించిందన్నమాట," యేదో జోక్ విన్నట్టు పెద్దగా నవ్వాడు మెనన్.

"ప్రొఫెసర్ మెనన్! ఆడ పిల్లలు అమ్మా నాన్నలకి శ్రమ తప్పించడానికి ప్రేమించరు. నిజంగా మనసుకి ఎవరో నచ్చడంతో ప్రేమిస్తారు," చిరాగ్గా అన్నది మీనాక్షి.

"అఫ్ కోర్స్! అయాం సారీ అశోక్. ఐ డింట్ మీన్ టు హర్ట్ యూ! ఇంతకీ మీ రెస్పాన్స్ యేమిటి? అబ్బాయి మీకు నచ్చాడా?"

తన కూతురి వ్యక్తిగత నిర్ణయాన్ని అనవసరంగా చర్చకు పెట్టినట్టనిపించింది అశోక్‌కి.

"అబ్బాయి బానే వున్నాడు, కుటుంబమూ మంచిదిలాగే వుంది. దాదాపు యేడాదిగా ఇంటికి వస్తూ పోతూనే వున్నాడు. ఎప్పుడూ ఎలాంటి అసభ్య ప్రవర్తనా చేయలేదు, కానీ ఏదో ఇబ్బంది. "

"మరైతే మిమ్మల్ని ఇబ్బంది పెట్టేదేమిటి? అతని మతమా?"

"ప్రత్యేకంగా అతనిదే మతమైనా నాకేమీ ఇబ్బంది లేదు. ఎందుకంటే, అతను చూడటానికి చాలా సంస్కారవంతుడిలా, చక్కగా వున్నాడు. అతనిలో ఎటువంటి లోపమూ నాకైతే కనబడలేదు. కానీ, ప్రపంచ వ్యాప్తంగా ముస్లిముల పరిస్థితి సున్నితంగా, కొంచెం సమస్యలతో నిండి వుంది. ఇటువంటి పరిస్థితుల్లో తమ తమ మంచి తనాలని కాపాడుకోవడం ఎవరికైనా సాధ్యమేనా? తెలియదు. అన్ని చోట్లా పెరుగుతున్న ఎగ్రెసివ్‌నెస్, అతి వాదం, మనలని మనలా మిగల నిస్తుందా? నా కూతురు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ, అతని పరిస్థితులని గౌరవించగలుగుతుందా? అన్నీ అనుమానాలే!" అశోక్ తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు.

"అవును, క్లాస్ రూములో పిల్లలకి అస్తిత్వాల గురించీ, ఐడెంటిటీ కుండే బలం గురించీ బోధించడం వేరు, ఇంట్లో అదే పిల్లలు తమ వ్యక్తిత్వాలు నిలుపుకుంటామంటే సరేననటం వేరూ!" మీనాక్షి సాలోచనగా అడిగింది.

"ఫక్తు అకేడెమీషియన్ మాటలు!"

"అయాం ఎన్ అకేడేమిషియన్ మెనన్"

"నాకు మతం కంటే ఎక్కువ, కుటుంబాల మధ్య వుండే వ్యత్యాసం గురించిన ఆందోళన ఎక్కువగా వుంది," వాళ్ళిద్దరి మాటలకి అడ్డొచ్చాడు అశోక్. అతని మాటలకి మెనన్ కొంచెం ఆశ్చర్యపడ్డట్టు కనిపించాడు.

"అవును, వారసత్వాన్నీ మనం ఎంత ఖండించినా, వారసత్వాలు మన ఆలోచనల్లోంచి పోవు," అన్నాడు మెనన్.

"వారసత్వమా?"

"వారసత్వమే! కుటుంబంలో వుండే అలవాట్లూ, వాళ్ళకున్న ఆస్తి పాస్తులూ, పిల్లలకి సంక్రమించిన తెలివితేటలూ, అన్నీ వారసత్వమే కదా? అందుకే మనందరం వారసత్వాన్ని నిరసించేకంటే, ఒప్పుకోవడం మంచి పద్ధతి. సరే, నాకు సెమినార్‌కి వేళవుతుంది. డోంట్ వరీ టూ మచ్ అశోక్. అంతా సర్దుకుంటుంది. ఒక్కసారి, ఈ పొరలన్నీ తొలగించుకోని ఆ అబ్బాయిని ఆబ్జెక్టివ్‌గా గమనించు. ఆల్ ది బెస్ట్!" మెనన్ హడావిడిగా వెళ్ళిపోయాడు.

"ఇప్పుడీయన డిపార్ట్‌మెంటంతా ఈ విషయం చాటింపు వేస్తాడేమో.సారీ అశోక్, అతనితో ఈ విషయం చెప్పకుండా వుండాల్సింది."

నవ్వాడు అశోక్.

"అయ్యో, ఇదేమైనా మర్డరా, దొంగతనమా దాచుకోవడానికి? ఇవాళ కాకపోతే రేపైనా అందరికీ తెలిసేదే కదా? మీరు దాన్ని గురించి వదిలేయండి," కాఫీ కప్పు తీసుకొని తనూ లేచాడు అశోక్. ఎవరూ ఎటువంటి పరిష్కారమూ చూపించకపోయినా, వాళ్ళతో మనసు పంచుకోవడం వల్ల కొంచెం మనసు తేలికైనట్టైంది అతనికి.

★★★★★★★★★★★★★★★

టీవీ చూస్తూ లేప్‌టాప్‌లో అసైన్‌మెంటు చేస్తున్న అనఘ తలుపు చప్పుడు విని తలెత్తి చూసింది.

"అరే, ఇంకా నాలుగు కూడా కాలేదు, అప్పుడే వచ్చేసావే?" లోపలికొచ్చిన భార్గవ్‌ని చూసి అన్నది.

"ఇవాళ పెద్ద పనేం లేదు, అందుకే." చెప్పులు విడిచి బైక్ తాళాలు గోడకి తగిలిని, హెల్మెట్ తీసి షూ రాక్ పైన వుంచి, మంచినీళ్ళకోసం వంటింట్లోకెళ్ళాడు భార్గవ్. అతని మనసు చాలా ఉత్సాహంగా వుంది. ఈ వారమంతా అతని ఆదాయం చాలా బాగుంది. కిందటి నెల అక్కడక్కడా డబ్బులు పోగొట్టుకొని కొంచెం భయపడ్డాడు. కానీ, ఈ వారం ధైర్యం చేసి కొంచెం ఎక్కువ డబ్బు పందాల్లో కాసాడు. అదృష్టం అతని

పక్కనే వుండడంతో పోయిన డబ్బంతా తిరిగొచ్చింది. కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. కానీ ఏ పనీ లేకుండా ఇంటి పట్టున కొడుకు కనపడితే భానూ కానీ అశోక్ కానీ వూరుకోరు. లక్ష ప్రశ్నలేసి ప్రాణాలు తీస్తారు. అందుకే పొద్దున్న వాళ్ళకంటే ముందు వెళ్ళిపోయి అక్కడక్కడా స్నేహితులతో కాలక్షేపం చేసి వొస్తున్నాడు.

లోపలినించి మంచినీళ్ళ గ్లాసు తెచ్చుకొని అలసటగా కూర్చున్నాడు.

"బాగా అలిసిపోయినట్టున్నావ్!" లాప్‌టాప్ మూసేసింది అనఘ.

"అవునే! అది సరే, నీకు కాలేజీ లేదూ? ఈ టైంలో ఇంట్లో వున్నావే?"

"శుక్రవారం నాకు క్లాసులేవీ వుండవు."

"అజహర్ ఎలా వున్నాడు?"

"బానే వున్నాడు. అది సరే, ఈ మధ్య నువ్వు ఎడిట్ చేసిన వీడియోలేవీ చూపించటం లేదు. బిజినెస్ బానే వుంది కదా?"

"బ్రహ్మాండంగా వుంది. ఎడిటింగ్ పనులు తగ్గించు కున్నాను."

"ఎడిటింగ్ తగ్గించుకొని మరేం చేస్తున్నావ్? షార్ట్ ఫిలింసా?"

కాసేపు మౌనంగా వున్నాడు భార్గవ్.

"షార్ట్ ఫిలింస్ కాదు, కానీ బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తున్నా. వాటిల్లో బానే రిటర్న్స్ వస్తున్నాయి. ప్రస్తుతానికి ఆదాయం బానే వుంది."

"హ్మ్మ...."

"ఏమిటి హ్మ్మ...?"

" ప్రొఫెషన్ అంటే నీకిష్టమైన పని చేయడం అని కదా నీ నమ్మకం? వున్నట్టుండి ఇలా సరిపడా డబ్బు సంపాదించడం అనే కాన్సెప్ట ఏమిటి?"

"అంటే, డబ్బు కూడా ముఖ్యమే కదా?"

నవ్వింది అనఘ.

"అమ్మా నాన్నా ఇంజినీరింగ్ ఎందుకు చదవాలని నువ్వు అడిగితే ఇదే మాటన్నారు మరి. ఇప్పుడు నువ్వు వాళ్ళలానే మాట్లాడుతున్నావు."

ఒక్క క్షణం ఏం మాట్లాడాలో తోచలేదు భార్గవ్‌కి. నిజమే, అమ్మా నాన్నా తనని ఇంజినీరింగ్ చదవమని ఎందుకన్నారు? ఒక జాబ్ సెక్యూరిటీ వుంటుందనీ, బ్రతుకంతా తను డబ్బుకి వెతుక్కోవాల్సిన పరిస్థితి వుండదన్న నమ్మకంతో. అందులో నిజమెంతో అన్నది వేరే విషయం. తనేమో అప్పుడు వాళ్ళతో డబ్బు కంటే ఇష్టమైన వృత్తిలో పని వెతుక్కోవడం ముఖ్యమని అనుకున్నాడు. అలాగే వాళ్ళతో వాదించాడు కూడా. మరిప్పుడు తన ఇష్టాలు మారిపోయాయా? లేక అనుకున్నంత డబ్బు సంపాదించకపోవడం ఇప్పుడు ప్రాముఖ్యత సంతరించుకుందా? అతనికి ఎందుకో అయోమయంగా అనిపించింది.

"అన్నయ్యా, నువ్వు ఏం చేస్తున్నావో, ఎలా సంపాదిస్తున్నావో నాకు తెలియదు. అది ఏదైనా నువ్వు అమ్మా నాన్నలతోటి చెప్పడంలేదు. చిన్నప్పటినించీ నీకు నచ్చిన ప్రతీ విషయాన్నీ, నిన్ను ఉత్సాహపరిచే ప్రతీ సినిమానీ మాతో పంచుకున్నావు. మరి వున్నట్టుండి ఈ రహస్యమేమిటో నాకు అర్థం కావడంలేదు. ఏం చేస్తున్నావో, ఎటు పోతున్నావో బాగా చూసుకో, బాగా ఆలోచించుకో!"

అనఘ లేచి లోపలికెళ్ళిపోయింది. భార్గవ్ ఆలోచనలో పడిపోయాడు.

★★★★★★★★★★★★

2024-జూలై

"అమ్మా!"

లేప్‌టాప్ పైనించి కళ్ళెత్తి చూసింది భాను.

"అనూ! ఆకలేస్తోందా? ఏమైనా తింటావా?"

"లేదమ్మా. నీతో కొంచెం మాట్లాడాలి."

"హా స్వీట్! ఎప్పుడూ నాన్నతోనే మాట్లాడాతావు, ఇవాళ అమ్మతో! అయాం ఇంప్రెస్‌డ్! పద, కిచెన్లోకెళ్ళి మంచి టీ పెట్టుకుందాం."

"అమ్మా, ప్లీజ్! నీతో మాట్లాడాలి."

"అలాగే, టీ తాగుతూ మాట్లాడుకోవచ్చు కదా?"

వంటింట్లోకెళ్ళింది భాను. అమ్మ వెనకే తనూ వెళ్ళి డబ్బాలు వెతికి బిస్కెట్లు తీసింది అనూ. ఇద్దరూ చెరో టీ కప్పూ తీసుకొని బాల్కనీలోకి నడిచారు.

"వాతావరణం ఎంత బాగుంది కదా! హైదరాబాదు జూలై నెలలో వున్నంత అందంగా, ప్లెజెంట్‌గా ఎప్పుడూ వుండదు. ఐ లవ్ దిస్ సిటీ!" భాను వానొచ్చేలా వున్న ఆకాశం వైపు చూస్తూ అన్నది.

"అమ్మా!"

"సారీ నాన్నా! ఏదో చెప్పాలన్నావు!"

"అజహర్ గురించి."

"అజహర్ గురించా? అంతా బానే వుంది కదా?" భాను కుర్చీలో నిటారుగా కూర్చుంది. తన ఒంట్లో నరాలన్నీ ఒక్కసారి టెన్షన్‌తో బిగిసినట్టు కావడం ఆమెకే తెలుస్తోంది.

"ఏమో మరి, తెలియటం లేదు. నా నిర్ణయం గురించి నాకే అనుమానంగా వుంది."

" "అంటే?"

"అజహర్‌తో బ్రేకప్ చేసుకుందామనుకుంటున్నాను."

భాను చేతులని అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తూ టీ కప్పు ముందున్న టీపోయ్ పైన పెట్టింది.

★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS